'స్వాతి' మాసపత్రిక - ఫిబ్రవరి, 1999

# భయం

గత నాలుగైదు రోజులుగా సరోజ ముఖంలో వెలుగు లేదు. కళ్ళల్లో కాంతి లేదు. అహరహం ఆవేదనా మనస్కురాలై అణువణువునా నిర్వేదనా భరితమై గడుపుతున్నది. కర్కశ కారుమేఘాలు ఆమె బతుకుపై కమ్మేసినట్టు కంపించుకు పోతున్నది.

ఆమె గుండెల నిండా చీకటి.

ఆ గది నిండా చీకటి. చీకటి గదిలో ఏకాంతంగా కూర్చొని ఏడుస్తున్నది సరోజ.

లైటు వేసింది సుందరమ్మ.

సుందరమ్మకి తన కోడలు వదనం చూసి - కడుపు దేవేసినట్టయింది.

"అదేమిటమ్మా! అలా కూర్చున్నావు. లే తల్లీ లే" అంది సుందరమ్మ.

కాయగూరలు కోసం అప్పుడే బజారుకి వెళ్ళివచ్చింది సుందరమ్మ.

'కోడలుగా రెండేళ్ల కిందట వచ్చిన నీవే అంత బాధపడితే - కనీ, పెంచి పెద్ద చేసిన తల్లిని నేనెంత బాధపడాలి' అనుకుంది సుందరమ్మ.

తల్లిగా తన దుఃఖం తనది.

భార్యగా ఆమె దుఃఖం ఆమెది.

సరోజను అర్థం చేసుకోగలదు తను.

ఆమెకు తన కుమార్తె ఉమ ఎంతో, కోడలు సరోజ కూడా అంతే.

దుఃఖంలోనున్న కోడలిని ఏదో పనిలోకి దింపి, ఆమె గుండె బరువు దించడం అత్యవసరంగా భావించి కాయగూరలు తరిగే పని సరోజకి అప్పజెప్పింది సుందరమ్మ. తనూ అక్కడే చతికిలబడి మాటల్లోకి బలవంతంగా దించింది.

సుందరమ్మ కూతురు ఉమ కూడా అప్పుడే వచ్చింది ఇంటికి.

ఇంత ఆలస్యం ఏమిటని అడిగింది తల్లి.

కాలేజీలో సాయంత్రం ప్రత్యేకంగా క్లాసు పెట్టారంది ఉమ.

మరో ప్రశ్నకి అవకాశం ఇవ్వకుండా లోనికెళ్ళిపోయి, పుస్తకాలు టేబుల్‌పై పడేసి, బాత్రూమ్‌కెళ్ళి ముఖం, కాళ్ళూ చేతులు కడుక్కొని - ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో వంపుకొని వచ్చి వాళ్ళ దగ్గరగా మంచం మీద కూర్చుంది ఉమ.

కాఫీ తాగుతున్న ఉమ ఒక్కసారిగా ఉలిక్కిపడి "అమ్మో! ఎంత బల్లో!" అంది.

తలెత్తి గోడ మీద బల్లిని చూసింది సరోజ.

సరోజకి నిలువెల్లా భయమేసి ఒళ్ళంతా కంపరం ఎత్తినట్టయిపోయింది. సరోజకి బల్లులంటే ఎంత భయమో అంత అసహ్యం.

చిన్న చిన్న బల్లులను చూసింది గాని అంత పెద్ద సైజులో అంత నల్లగా ఉడుంలా వున్న బల్లిని తను ఇదే చూడ్డం! అది పురుగులను కాకుండా మనుషుల్నే తినేలా వుంది.

ఎక్కడ నుంచి వచ్చిందోగాని -

ఆ రాక్షసబల్లి నెమ్మదిగా గోడ దిగుతోంది.

సరోజకి భయం వేసింది.

భయంతో చిన్న చప్పుడు చేసింది.

బల్లి ఆగి 'మధ్య నీకేం?' అన్నట్టు తీవ్రంగా చూసింది సరోజ వైపు.

"బల్లి ఏం చేస్తుంది సరోజా! ప్రతి చిన్నదానికి భయపడతావు" అంది సుందరమ్మ.

"ఆ బల్లి కిందకి ఎందుకు దిగుతుందో తెలుసా వదినా!... అదిగో అక్కడ తూనీగ

వుంది” చూపించింది ఉమ.

అయ్యో! తూనీగ ఇక్కడికెలా వచ్చింది? మెరుస్తున్న రెక్కలతో అందంగానూ, మరెందుకో దీనంగానూ కన్పిస్తోంది. పాపం అది ఏ తల్లిని తప్పిపోయి వచ్చిందో!

బల్లి నోట పడకుండా రక్షించే ఉద్దేశంతో పక్కనే వున్న చీపురుతో తూనీగను నెట్టింది సరోజ.

తూనీగ కంగారు, కలవరపాటుతో అటూ ఇటూ ఎగరడం మొదలెట్టింది. ఎగిరెగిరి చివరికి గోడ మీద వాలింది. ఫర్వాలేదు. అది బల్లి వున్న గోడ కాదు. ఎవరన్నారు? ఈ నాలుగ్గోడలూ నావే అన్నట్టు. చరచరా పాకుకుంటూ తూనీగ వున్న గోడను అరసెకనులో చేరుకుని... అక్కడ తొందరపడకుండా.. నెమ్మదిగా.. లేడిని వేటాడ్డానికి చప్పుడు చేయకుండా అడుగులో అడుగువేస్తూ సమీపించే పులిలా అతిమెల్లగా తూనీగ వైపు కదుల్తోంది బల్లి.

తూనీగ అందకుండా – మళ్ళీ అటూ ఇటూ ఎగరడం మొదలెట్టింది.

తూనీగ చురుకైనదే అనుకుంది. తర్వాత అది కనిపించలేదు సరోజకి. పోనీలే. రాకాసిబల్లి రంపపు నాలిక్కి బలి కాకుండా తప్పించుకుపోయినందుకు సంతసించింది సరోజ.

అంతలోనే –'కెవ్' మంది ఉమ.

బల్లి అమిత వేగంతో గోడ దిగి, నేలపైకి వచ్చేసి... అమాంతంగా తూనీగను కరచుకొని గోడ మీదకు వెళ్ళిపోయింది – అంతా రెప్పపాటులో.

ఆ భయానక దృశ్యం చూసి ముగ్గురు ఆడవాళ్ళు హడలిపోయేరు.

ఉమ మంచం దిగి, తల్లీ వదినల దగ్గరికి, మరీ దగ్గరికి వచ్చేసింది.

సుందరమ్మకెందుకో అశుభంగా తోచింది.

రెక్కలు కట్టుకొని ఊరు కాని ఊరు వెళ్ళిన, అభం శుభం తెలీని తన కొడుకు గుర్తుకొచ్చి... ఆ రాక్షస కర్మ్యాలో ఏ కబంధ హస్తాలకి ఇరుక్కుపోయేడో నా చిట్టితండ్రి అనుకుంటూ పమిట చెంగుతో కళ్లు ఒత్తుకుంది సుందరమ్మ.

ఒకవేళ తన కొడుక్కి జరగరానిదేదో జరిగితే – ఈ కుటుంబ పరిస్థితి ఏమిటి?

రోడ్డున పడవలసిందేనా?

తెచ్చుకుంటున్న జీతం చాలడం లేదనే కదా... చిట్టితండ్రి అంత దూరం వెళ్ళాడు!

ఒరే నాయనా! ఎందుకెళ్ళావురా తండ్రీ! ఉన్నంతలో అదే సర్దుకు తినేవాళ్ళం కదరా కన్నా!

ప్రకాష్ మంచి కంపెనీలో మంచి ఉద్యోగం కోసం – అంటే ఎక్కువ జీతం కోసం – హైద్రాబాద్ వెళ్ళేడు ఇంటర్వ్యూకి.

అతడు హైద్రాబాద్ మిత్రుడు అన్వర్ ఇంటికి అతిథిగా వెళ్ళేడు. వందలు చెల్లించి లాడ్జిలో వుండేటంత స్తోమత లేని మధ్య తరగతి వాడు ప్రకాష్. అసలు ప్రకాష్ లాడ్జిలో దిగితే అన్వర్ ఒప్పుకునే రకం కాదు.

అన్వర్ పట్ల సరోజకి ఎలాంటి అనుమానం లేదు. భయం లేదు.

చాలా మంచిమనిషి. స్నేహానికి ప్రాణం పెడతాడు. కానీ రోజులే మంచిగా లేవు. మనిషిలో మంచిని మింగేస్తున్న మాయదారి రోజులు.

దురదృష్టవశాత్తు ప్రకాష్ హైద్రాబాద్‌లో దిగిన మరుసటి రోజే హిందూ ముస్లిమ్‌ల మధ్య మతకలహాలు భగ్గుమన్నాయి. నగరమంతా కర్ఫ్యూ. మూడు రోజుల్లో రావల్సిన మనిషి వారం దినాలైనా ఇంకా ఇంటికి చేరలేదు. కనీసం క్షేమంగా వున్నట్టు సమాచారం కూడా లేదు.

నేరుగా పులిగుహలోకే ప్రవేశించినట్లు... పాత బస్తీలో ఒక ముస్లిం ఇంట్లో.. అతనికి రక్షణ ఏముంటుంది?.. అన్వర్ మిత్రుడే కావచ్చు... కానీ ఆ గల్లీలో మిగతా వాళ్ళు దాడి చేస్తే...

"అబ్బా!" అంది సరోజ.

దొండకాయలు తరుగుతున్న సరోజ బొటన వేలు గాయమయ్యింది. రక్తం. సరోజ చేతికంతా రక్తం, చీర కయిన రక్తం. నేల కయిన రక్తం. కత్తిపీట అంచున రక్తం.

ఎంతకీ రక్తం కట్టడం లేదు. అసలు అందుకు ప్రయత్నమే చేయడం లేదు సరోజ. తన శరీరంలో రక్తమంతా.. ఈ తెగిన వేలు నుంచి మొత్తం బయటికొచ్చేసి గుండె ఆగిపోతే ఎంత బాగుణ్ణు అన్నట్టు.. అలా వుండిపోయింది సరోజ.

"ఏమిటమ్మా సరోజా! పరధ్యానం...కత్తిపీట దగ్గర అంత అజాగర్తగా వుంటే ఎలా? ఏమిటో, ఈ ఇంటికేమైందో తెలీకుంటోంది" – సరోజ బొటన వేలుని అదిమి పట్టుకుంది సుందరమ్మ.

ఉమ పరుగున వెళ్ళి ఏదో గుడ్డను చింపి తీసుకువచ్చింది. సుందరమ్మ కట్టు కట్టింది. రక్తం గడ్డకట్టేవరకూ ఆ వేలుని గట్టిగా చాలాసేపు పట్టుకునే వుండిపోయింది సుందరమ్మ.

సుందరమ్మ మనసు కీడు శంకిస్తోంది.

కోడలికి గాయం – నేలపై బొట్లుబొట్లుగా రక్తం .. ఏమిటిది? ఎందుకిలా జరిగింది?

ఆమె గుండెల్లో భయం చలిజ్వరంలా ముంచుకొచ్చి వణికించేసింది.

భగవంతుడు ఈ ఇంటిపై పగబట్టలేదు కదా!

ఉమకి చెప్పి తడిగుడ్డతో రక్తపు మరకలు వున్న నేలంతా శుభ్రం చేయించింది.

కత్తిపీటని కడిగించింది. రక్తం చుక్క లేకుండా గదినంతా శుభ్రం చేసినా – సరోజ చీరపై రక్తపు మరకలు ఆమెకు భీతిని కలిగిస్తున్నాయి.

వెంటనే సరోజ చీర మార్చుకునే వరకూ ఊరుకోలేదు సుందరమ్మ.

"అమ్మా! ప్రాంతీయ వార్తలు వచ్చే టైమైంది" – తెలియజేసింది ఉమ.

తెలియచేయనక్కరలేదు. ఆ విషయం సరోజకి తెలుసు. సుందరమ్మకీ తెలుసు.

అవును. ఎప్పటి నుంచో వాళ్ళ చూపులు గోడ గడియారం మీదే వున్నాయి.

ప్రాంతీయ వార్తలు వినడం కోసమే వాళ్ళు అక్కడ చతికిలబడి వున్నారు.

ఆవతల చూస్తే వంటగదిలో చేయాల్సిన పని చాలా వుంది. ఇంకా స్టౌ వెలిగించనే లేదు.

పాటలకీ, నాటకాలకీ తప్ప ఎప్పుడూ రేడియో జోలికి వెళ్ళని ఆ ముగ్గురు ఆడవాళ్ళు గత నాలుగైదు రోజులుగా వార్తలు వచ్చినప్పుడల్లా చెవిలొగ్గి మనసు బిగబట్టుకు వింటున్నారు.

అలాగే పేపరు కొనే అలవాటు ఆ ఇంట్లో లేదు. కానీ వీళ్ళిప్పుడు ఖచ్చితంగా పేపరు కొని తప్పకుండా చదువుతున్నారు.

తిరిగి రావల్సిన సమయానికి ప్రకాష్ రాక, కనీసం ఎలాంటి సమాచారం లేక తల్లడిల్లిపోతున్న ఆ ఇంటి ఆడవాళ్ళు రేడియో, పేపరుని ఆశ్రయించడం తప్ప మరేమీ తోచని స్థితిలో వున్నారు.

రేడియో పెట్టింది ఉమ. ప్రాంతీయ వార్తలు ఇంకా మొదలు కాలేదు. ఇంకేదో వస్తూ వాళ్ళలో చిరాకు, అసహనాన్ని పెంచుతోంది.

ముగ్గురూ ముళ్ళమీద నిశ్శబ్దంగా కూర్చున్నారు.

వార్తలు వచ్చేవరకూ... ఆ కాస్త సమయం భగవంతుని ధ్యానిస్తోంది సరోజ. ఆ ధ్యానమే, ఆ చింతనే ఆమెకి కొంతలో కొంత శాంతి నిస్తోంది.

ఆమె కెందుకో ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్టయింది. ఇల్లంతా చీకటి సముద్రంలో మునిగిపోయినట్టు అనిపించింది.

వార్తలు వినే శక్తి లేకుండా చెవులు దిబ్బలేసుకుపోయినట్టనిపించింది. చీకటి.... కటిక చీకటి. ఇల్లంతా చీకటి. భయంకర నిశ్శబ్దం.

"అమ్మా! కరెంటు పోయిందే" అంది ఉమ.

స్పృహలోకి వచ్చింది సరోజ.

సుందరమ్మ గుండె బరువయ్యింది. ఏమిటిది? ఇందాక ఎర్రటి రక్తం. ఇపుడు నల్లని చీకటి.

ఇది అశుభం. 'భగవంతుడా! దీనరక్షపాలకా! నా కొడుక్కేమీ జరగలేదు కదా! ఏడుకొండలవాడా వెంకటరమణా! మమ్మల్ని దిక్కులేనివాళ్ళగా చేయకు. నా బిడ్డను రక్షించు తండ్రీ! మాకు దక్కించు తండ్రీ!' – చీకట్లో చేతులెత్తి, కన్నీళ్ళతో దేవుళ్ళందర్నీ ప్రార్థించింది సుందరమ్మ.

"అమ్మా! అగ్గిపెట్టె ఎక్కడుందే?" అడిగింది ఉమ దీపం వెలిగించడానికి.

ఇపుడీ ఇంట్లో దీపం వున్నా ఒకటే, లేకున్నా ఒకటే. దీపమున్నా చీకటే కదా!

ఇపుడు వెంటనే, వెన్వెంటనే కావాల్సింది అగ్గిపెట్టె, దీపం కాదు – వార్తలు వినిపించే రేడియో.

"ఉమా! నేను వార్తలు వినాలి" సరోజ గొంతు ఉమను కదిలించింది.

ఉమ కదిలింది వెంటనే - దీపం వెలిగించడానికి కాదు. ఇల్లంతా కటిక చీకటైనా, కళ్ళు పొడుచుకున్నా కానరాకపోయినా... అలవాటైన ఇల్లు కావడం చేత.. అట్టే ఇబ్బంది లేకుండా నాలుగడుగుల్లో గడప దాటి - పక్క ఇంటి పోర్షన్ నుంచి ట్రాన్సిస్టర్ ఒక నిమిషంలో తీసుకువచ్చింది ఉమ.

వార్తలు అప్పటికే మొదలయ్యేయి. కాదు అప్పుడే మొదలయ్యాయి.

... జంటనగరాలలో గత ఆరు రోజులుగా అమలులో వున్న కర్ఫ్యూని గురువారం ఉదయం మూడు గంటలు సడలించిన సందర్భంగా హింసాత్మక సంఘటనలు జరగడంతో మరో ఇరవై నాలుగ్గంటలు కర్ఫ్యూని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హింసాత్మక సంఘటనల్లో ఏడుగురు మరణించగా మరో తొమ్మిది మంది గాయపడ్డారు.

షంషేరీ గంజ్‌లో కూలి కోసం వెళ్ళిన ముగ్గురు యువకులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరచగా ఇద్దరు మరణించేరు. మూడవ యువకుడు తీవ్రంగా గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హుస్సేనీ ఆలంలో ఒక వ్యక్తి శవాన్ని పోలీసులు కనుగొన్నారు. అతనిపై కత్తిపోట్లు ఉన్నాయి. అతడు ఏదో పనిపై వచ్చి హైద్రాబాద్ కర్ఫ్యూలో ఇరుక్కుపోయిన వ్యక్తిగా తెలుస్తోంది. అతని వివరాలు తెలియరాలేదు. చెదురు మదురుగా చిన్న చిన్న సంఘటనలు మినహా పరిస్థితి ప్రశాంతంగా వుందని పోలీస్ కమీషనర్ తెలిపారు...

సరోజకి ఇక ఏమీ వినిపించడం లేదు. ఆమె మస్తిష్కం నిండా ఒకే ఒక్క వార్త.

అది - 'హుస్సేని ఆలంలో ఒక వ్యక్తి శవం. కత్తిపోట్లు. అతడు పై ఊరి వాడు'.

ఆ వార్త ఆమెను కుదిపేస్తోంది. వెంటాడుతోంది. వణికించేస్తోంది.

ఒళ్ళంతా చెమటలు చెమటలు పోస్తున్నాయి. ఆమె కళ్ళల్లో నీళ్ళు ధారగా చెమటతో కలిసిపోతున్నాయి.

ప్రకాష్ వున్నది ఎక్కడ?.. అన్వర్ ఇంట్లో అన్వర్ ఇల్లు ఎక్కడ?.. హుస్సేని ఆలం. అవును. అవునౌను...

కాదు...కాదు...కాదు.. కావడానికి వీల్లేదు.

ఇంట్లో పాతడైరీలో నోట్ చేయబడిన అడ్రసులున్నాయి. డైరీ చూడ్డానికి లేచింది సరోజ. ఉమ దీపం వెలిగించింది. ట్రాన్సిస్టర్ కట్టేసింది.

ఉమ దీపం పట్టుకుంటే సరోజ డైరీ వెదుకుతోంది. డైరీ ఎక్కడ వున్నదీ సమయానికి గుర్తు రావడం లేదు. టేబుల్‌పైన, సొరుగుల్లోనూ, విలువైన కాగితాలు, ముఖ్యమైన వస్తువులు జాగ్రత్తపరిచే అన్నిచోట్లా వెదికింది.

కనిపించలేదు డైరీ.

ఈ చిన్న ఇంట్లో ఎన్ని సామానులున్నాయని డైరీ కనిపించకపోవడానికి.

టేబుల్‌పైనున్న ఉమ పుస్తకాలలో కలిసిపోయిందేమోనని వెదికింది.

కనిపించలేదు డైరీ.

వదిన డైరీ ఎందుకు వెదుకుతున్నదీ ఉమకి అర్థమయి, ఆమెకీ ఏడుపు వస్తోంది.

ఒక విధంగా ఆ సమయంలో డైరీ కనిపించకపోవడమే మంచిదిగా ఉమకి తోచింది.

డైరీ కనిపించి... వదిన అనుమానం నిర్ధారణ అయితే ఆ షాక్‌కి వదిన తమకు దక్కదేమోనని ఆమె భయం. అంచేత ఉమ నిశ్శబ్దంగా భగవంతుని ప్రార్థిస్తోంది - డైరీ కనిపించకుండా చేయమని.

సరోజ కూడా భగవంతుని ప్రార్థిస్తోంది. దేవుని దయవల్ల డైరీ దొరకాలి. దొరకాలి. దొరికిన డైరీలో అన్వర్ అడ్రస్ వుండాలి. ఆ ఎడ్రసులో హుస్సేనీ ఆలం లేకుండా వుండాలి.

భగవంతుడు తనకెప్పుడూ అన్యాయం చేయలేదు. అంచేత అన్వర్ ఇల్లు హుస్సేనీ ఆలంలో వుండదు. ప్రకాష్‌కి ఆ ఊరు పేరు కూడా తెలీదు. అక్కడికి వెళ్ళలేదు. అంతే.

పై ఊరి వాళ్ళు... మెట్రోపాలిటన్ సిటీకి వచ్చి పోతుండేది ఒకరా! ఇద్దరా! లక్షల మంది!

"బీరువాలో వుండేమో చూడమ్మా!" అంది సుందరమ్మ.

బీరువాలో ఎందుకుంటుందీ!

ఏనాడూ డైరీ అందులో వుండగా చూసినట్టు గుర్తులేదు. అయినా - తాళం చెవితో బీరువా తెరిచింది సరోజ. నిజమే! బీరువాలో ఒక అరలో మూలన వుంది డైరీ! వణుకుతున్న చేతులతో డైరీ పేజీలు తిప్పింది.

నుదుటిపై చెమట, కళ్ళల్లో నీరు కలిసిపోయి చూపును ఆటంకపరుస్తున్నాయి. అక్షరాలు మసక మసగ్గా కనిపిస్తున్నాయి.

పమిటచెంగుతో కళ్ళు తుడుచుకుని.. వేయి దేవుళ్ళను ప్రార్థిస్తూ.. పేజీలు తిరగేస్తోంది. వరుసగా వున్న అడ్రసుల మీదికి చూపుడు వేలుని పోనిచ్చింది. ఆ చూపుడు వేలు వణుకుతూ కిందకి దిగి దిగి.. అన్వర్ అడ్రస్ దగ్గర ఆగిపోయింది.

హుస్సేనీ ఆలం అక్షరాలపై సరోజ కన్నీటి చుక్కలు పడ్డాయి. పడిన చుక్కలు న్యూక్లియర్ బాంబులా పేలేయి.

స్పృహ కోల్పోయి దబ్బున పడిపోయింది సరోజ. పడిపోయేటప్పుడు ఆమె చేతి గాజులు గోడకి ఫట్‌మని తగిలి చిట్లేయి. ఇల్లంతా చేదిరేయి.

"అమ్మా" అని అరచింది ఉమ.

"అమ్మా... తల్లోయ్" అని కేకలు పెడుతూ పరుగున వచ్చింది సుందరమ్మ.

ఏడుస్తూ కోడలిని ఒడిలోకి తీసుకుంది సుందరమ్మ. ఏడుస్తూనే ఉమ పరుగున వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చింది.

సుందరమ్మ సరోజ ముఖంపై నీళ్ళు చల్లింది.

సరోజ నెమ్మదిగా లేచి కూర్చుంది.

"అత్తయ్యా! హుస్సేనీ ఆలంలో మీ అబ్బాయి వున్నది నిజమేనత్తయ్యా" అంటూ ఒడిలో వాలిపోయి ఏడ్వసాగింది సరోజ.

"ఊర్కో సరోజా ఊర్కో... నా కొడుక్కేం జరగదు. భగవంతుడు మనపట్ల వున్నాడు. వాడు క్షేమంగా తిరిగి వస్తాడు" – కోడలికి ధైర్యం చెబుతున్న సుందరమ్మ పూర్తిగా ధైర్యం కోల్పోతున్నది.

బల్లి నోట్లో తూనీగ... సరోజ వేలికి గాయం... చీరపై ఎర్రటి నెత్తురు... ఇంట్లో చిందిన రక్తం.... ముసిరిన చీకటి... పగిలిన గాజులు...సుందరమ్మ మనసు కీడునే శంకిస్తోంది.

సుందరమ్మకీ ఏడుపు వస్తోంది.

అంతలో ఫ్లాష్‌లా కరెంటు వచ్చి లైటు వెలిగింది. ఫ్యాను తిరుగుతోంది.

రేడియోలో బర్‌మని రొద – ట్యూన్ చెదిరి.

అప్పుడే వంట గదిలో దబదబ గిన్నెల చప్పుడు.

"చూడమ్మా ఉమా! ఎలుకల్లా వున్నాయి" – సుందరమ్మ కూతుర్ని వెంటనే వెళ్ళమంది. వెళ్ళబోయిన ఉమ గతుక్కుమని ఆగిపోయింది.

పిల్లి నోట్లో ఇంత ఎలుక వుంది.

కరుడుగట్టిన మతోన్మాదంలా బలిసిన పిల్లి మూతి నిండా రక్తంతో క్రూరంగా వుంది. కత్తిపోట్లకి బలైన అమాయక ప్రాణిలా దాని నోట్లో గిలగిలలాడుతున్న ఎలుక.

ఇంటి తలుపులు మూసి వున్నాయి.

పిల్లి వాళ్ళ వైపు తీక్షనంగా, క్రూరంగా చూసింది. తీవ్రంగా కళ్ళెర్రజేసింది.

నయం వాళ్ళపైకి దుమకలేదు.

తెరచి వున్న కిటికీ కనిపించడంతో వాళ్ళను వదిలేసింది. చిరుతపులిలా ఒక్క ఉదుటున కిటికీ చేరుకుంది. ఎలుకను గట్టిగా కరుచుకని, మరోసారి వాళ్ళ వైపు క్రూరంగా చూసి, ఠీవిగా, దర్జాగా బయటకి వెళ్ళిపోయింది.

ఆ బీభత్స జుగుప్స దృశ్యం ఆడవాళ్ళు ముగ్గురునీ షాక్‌కి గురిచేసింది. నోటి మాట లేకుండా, కాళ్ళు కదపలేకుండా చాలాసేపు అలానే వుండిపోయేరు. లయ తప్పిన రేడియో రణగొణ ధ్వని తప్ప మరో అలికిడి లేదు.

అంతలో ఎవరో తలుపు తడుతున్నట్టు సన్నగా వినికిడి. మళ్ళీ అలజడి. గుండెలు దడ్‌దడ!

రేడియో రొదలో తలుపు చప్పుడు స్పష్టంగా వాళ్ళకి వినిపించడం లేదేమో! అలాగని ఏ ఒక్కరూ రేడియో కట్టే ప్రయత్నం చేయడం లేదు. ఏదో భయం! నిరాసక్తత. నిర్లిప్తత.

ఈసారి తలుపు గట్టిగా కొట్టిన చప్పుడు.

తుళ్ళిపడ్డారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అంతే తప్ప ఎవరికీ ముందుకు కదిలే శక్తి లేదు. తలుపులు తెరిచే ధైర్యం లేదు.

తలుపులు తెరిస్తే మరే దుశ్శకునాలు దర్శనమౌతాయో! ఇంకే భయానక దృశ్యాలు తారసపడతాయో! ఏ టెలిగ్రాము విషాదాన్ని పులుముకొని ఎదురవుతుందో!

ఏ మత విద్వేషపు అగ్నిశిలలు రగిలి, పగిలి... విషపూరిత లావా జ్వలించి, ద్రవించి, స్రవించి ఉప్పెనలా ఉవ్వెత్తున ఎగిసి వాళ్ళని మాడ్చి మసిచేసేస్తుందనో...

వాళ్ళు ముందుకు అడుగేయలేదు.

రేడియోలో బర్రుమని రొద మతకలహాల మరణమృదంగ ధ్వనిని తలపింపచేస్తున్నది.

గట్టిగా మరోసారి తలుపు చప్పుడు.

అంతేకాదు అవతల గొంతు కొంత స్పష్టంగా వినగలిగే స్పృహ కలిగివున్నారు వాళ్ళు. మరోసారి ఆ గొంతు విన్నారు. ఇంకొకసారి –

ఆ గొంతు ముగ్గురు స్త్రీలకూ ఎంతగానో పరిచయమైన గొంతు అది.

అంతే! సరోజలో ఎక్కడలేని శక్తి, గొప్ప ధైర్యం ఒక్కసారిగా ప్రవేశించేయి.

రెండే రెండు అంగలు. గభాల్న గడియ తీసింది. తలుపు రెండు రెక్కలు బార్లా తెరిచింది. సరోజ వెనుకే ఉమ, సుందరమ్మ వున్నారు.

తలుపులు తెరిచిన వెంటనే ఒక్కసారిగా హాయిగొలిపే చల్లని గాలితెమ్మెర ముగ్గురు స్త్రీలను స్పృశించి ఆహ్లాదపరచింది.

ఉమ చేయి తగిలి కాబోలు రేడియో ట్యూన్ లైన్‌లో పడింది. ఇపుడు సుమధుర, శ్రావ్య సంగీతం ఆ గది సమస్తం వ్యాపించి ఆ స్త్రీలను దివ్యలోకాల అంచుకు తీసుకు వెళ్తోంది.

వెన్నెల జల్లులు కురిపిస్తోంది. సంపెంగ సువాసనలు వెదజల్లుతోంది.

ఇంతవరకూ వాళ్ళను బెంబేలెత్తించిన దుశ్శకునాలకి వ్యతిరేకంగా, అతీతంగా ఎదురుగా ఒక సుందర దృశ్యం!

తలుపులు తెరచిన సరోజ కెదురుగా ప్రత్యక్షమయ్యేడు ప్రకాష్.

ప్రత్యక్షమై ఆమెనే కాక ఇంటిల్లిపాదినీ ఆనందడోలికల్లో ముంచెత్తాడు ప్రకాష్.

ప్రకాష్ పక్కనే అన్వర్ కూడా వున్నాడనే విషయం ఆ ఇంటి స్త్రీలు విస్మరించలేదు.

అంతా ఆత్మీయంగా పలకరించుకున్నారు.

"బెహన్‌జీ! మీ ఆయన్ని నీకు అప్పగించి వెళ్దామనే నైతిక ధర్మంతో వచ్చానమ్మా"

మత విద్వేషపు హాలాహలం.. ఉన్మాదుల విచ్చుకత్తుల వీరవిహారం.. ముష్కర మూకల దారుణ మారణహోమం... తల్వార్ల కత్తుల కరాళ నృత్యం... గుండా తండాల బీభత్సకాండ...

వీటన్నింటినీ అధిగమించి, ఎదురీది, ప్రాణాలొడ్డి... సురక్షితంగా ప్రకాష్‌ని తీసుకు వచ్చేడు అన్వర్.... హుస్సేనీ ఆలం అన్వర్.

కృతజ్ఞతలతో సరోజ కళ్ళనీళ్ళు చిమ్మేయి.